క్లుప్తంగా

ఐవోసీఎల్ స్టార్టప్ కమిటీ సభ్యునిగా పురుషోత్తం



పురుషోత్తం అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఆయిల్ స్టార్టప్ స్కీం–గ్రీన్ రిజాల్వ్–అమృత్ కాల్ అధ్యయ సభ్యునిగా ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పురుషోత్తంను అభినందించారు. ఐవోసీఎల్ స్టార్టప్‌ని ప్రోత్సహించే ప్రక్రియలో భాగంగా దేశ వ్యాప్తంగా నవ్య ఆలోచనలను ఆహ్వానిస్తోంది. వీటిని పరిశీలించి ఎంపిక చేసే కమిటీలో సభ్యునిగా డాక్టర్ పురుషోత్తం నియమితులయ్యారు.

బహుమతుల ప్రదానం

మద్దిలపాలెం : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు ఆదివారం పిఠాపురం కాలనీలోని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీసీ వ్యవస్థాపకురాలు కె.రమాప్రభ మాట్లాడుతూ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో పోటీలను నిర్వహించామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఆసరా చారిటబుల్ సొసైటీ సహకారంతో అందించామన్నారు. అ కార్యక్రమంలో మణి, నీలవేణి, గణేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వినీల్‌కుమార్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థి ఎస్.వినీల్ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పర్యవేక్షణలో ‘ఎ స్టడీ ఆన్ ద పర్సెప్షన్ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్ టువర్డ్స్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ టీచింగ్ ఫిజికల్ ఎడ్యుకేషన్’ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినీల్‌కుమార్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

విద్యారంగ పరిరక్షణకు పాటుపడాలి

విశాఖ విద్య: విద్యారంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. యూటీఎఫ్ 49వ కౌన్సిల్ సమావేశం ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అయితేనే విద్యారంగం పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఇందు కోసం విద్యావేత్తలు కృషి చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ చిల్డ్రన్ క్లబ్ నిర్వాహకులు కోరెడ్ల రమాప్రభ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోవర్ధన పూజ



గోవర్ధన పర్వతం ఆకారంలో ఏర్పాటు చేసిన స్వీట్లు, కేకు

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గోపూజ, గోవర్ధన పూజలను ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి నెయ్యి దీపాలు అర్పించడం, దామోదర హారతి, ప్రసాద స్వీకరణ కార్యక్రమాలు జరిపారు. గోవర్ధనగిరి పూజ సందర్భంగా శాకాహారంలతో తయారు చేసిన 200 రకాల స్వీట్లు, 250 కేజీల కేక్‌ను పర్వతం ఆకారంలో శ్రీకృష్ణుడికి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిష్కించన భక్తదాస భక్తులకు గోవర్ధన లీలా విశేషాలను వివరించారు. భక్తులు గోమాతను పూజించి ప్రసాదం తినిపించారు.

ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టింది. పాఠశాలల రూపురేఖలతో పాటు విద్యా బోధనలో మార్పు తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా పేద-మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తోంది. పాఠశాలలకు నిధులు కేటాయిస్తూ రూపురేఖలను మార్చేసింది. మూస ధోరణిలో కాకుండా కొత్త తరహాలో బోధిస్తేనే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని, ప్రయివేటు పాఠశాల దోపిడిని అరి కట్టాలంటే ప్రభుత్వ పాఠశాలలను అదే స్థాయిలో మార్చాలని తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది. ఒకప్పుడు కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని స్కూళ్ల పరిస్థితి నుంచి నేడు అడుగడుగునా అభివృద్ధి కనిపిస్తోంది. విద్యార్థులకు యూనిఫారమ్ పంపిణీ దగ్గర్నుంచి పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం వరకు వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. అలాగే తరగతి గదుల్లో ఫర్నీచర్, టాయిలెట్లు కార్పొరేట్ హంగులతో ఏర్పాటు చేశారు. పాఠశాలల్లోని ఆవరణ ఆహ్లాదకరంగా ఉండేటట్టు ఏర్పాట్లు చేశారు.



\- ఎంవీపీ కాలనీ



సర్వాంగ సుందరంగా మారిన సెక్టార్-7 జీవీఎంసీ స్కూల్

సంకల్పించినాడు సత్ఫలితాలు నేడు

మారిన ఎంవీపీ జీవీఎంసీ స్కూల్ ముఖచిత్రం

రూ.1.30 కోట్లతో స్కూల్ సర్వముఖాభివృద్ధి

అధునాతన క్లాస్ రూమ్స్, టాయిలెట్స్ సౌకర్యం

మొత్తం విద్యార్థులు
171 మంది

నాడునేడు విడుదల చేసిన నిధులు
1.30 కోట్లు

స్మార్ట్ క్లాస్ రూంకు వెచ్చించిన నిధులు
రూ.50 వేలు

బోధన సిబ్బంది
7 గురు



ఆధునికీకరించిన తరగతి గదుల సముదాయం

నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవడంతో ఎంవీపీ కాలనీ సెక్టార్-7 ప్రాథమిక పాఠశాల ముఖచిత్రం మారింది. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా నిలిచిన ఈ పాఠశాల రూపురేఖలు నేడు మారిపోయాయి. నగరంలోని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా జీవీఎంసీ ‘సిటీస్’ పేరుతో ఈ స్కూల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. ఈ స్కూల్‌లో 171 మంది విద్యార్థులుండగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏడుగురు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. గతంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలిచిన ఈ పాఠశాల.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఏర్పడిన తరువాత కార్పొరేట్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. ఈ స్కూల్‌ను ఆనుకొని వున్న అంగన్‌వాడీ కేంద్రాలను సైతం జీవీఎంసీ అభివృద్ధి చేయడంపైనా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.30 కోట్లతో అభివృద్ధి

ఈ పాఠశాలను రూ.1.30 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూల్‌లో సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ఆధునీకరణ కోసం రూ.50వేలకు పైగా నిధులు వెచ్చించారు. విద్యార్థులకు వేరువేరుగా అధునాతన టాయిలెట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. తరగతి గదుల్లో కార్పొరేట్ తరహాలో బెంచ్‌లు, అధ్యాపకులకు ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకోకుండా, అసౌకర్యంగా మారిన ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులను చేపట్టి పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. 5 నుంచి 6 తరగతి గదులను, ఒక ప్రిన్సిపల్ రూమ్, స్టాఫ్ రూమ్‌లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. ఆ గదుల్లో బీరువాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో నాలుగు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

స్కూల్ మొత్తాన్ని కార్పొరేట్ లుక్‌తో విద్యార్థుల్లో ఆహ్లాదాన్ని పెంచే కలర్స్‌తో అధునాతనంగా తీర్చిదిద్దారు. దీంతో పాటు కాంపౌండ్ వాల్, కాంపౌండ్ వాల్‌పై ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. స్కూల్ భవనం చుట్టూ గార్డెన్‌ను తీర్చిదిద్దారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

మెరుగుపడిన సౌకర్యాలు



మా స్కూల్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉంది. గతంతో పోలిస్తే చాలా మారిపోయింది. అన్ని సౌకర్యాలు మెరుగుపడ్డాయి. దీంతో రోజూ స్కూల్‌కు వెళ్లాలనే ఆసక్తి పెరిగింది. తాగు నీరు, టాయిలెట్స్ చాలా బాగున్నాయి. క్లాస్‌రూమ్స్‌ను కూడా మంచిగా తీర్చిదిద్దారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.


\- ప్రేమ్‌కుమార్, 4వ తరగతి

ఏర్పడిన సౌకర్యాలు

తరగతి గదిలో ఫ్యాన్లు, కాంపౌండ్ వాల్, కాంపౌండ్ వాల్‌పై ఫెన్సింగ్,స్టాఫ్ రూమ్‌ల ఆధునికీకరణ, ఆర్‌ఓ ప్లాంట్, కార్పొరేట్ తరహాలో బెంచీలు,స్కూల్ భవనం చుట్టూ గార్డెన్, గోడలకు ఆహ్లాదకరమైన రంగులు



అధునాతన టాయిలెట్స్



ఆధునికీకరించిన తరగతి గదుల సముదాయం

భవిష్యత్‌కు మార్గం..



నాడు - నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా జీవీఎంసీ సిటీస్ పేరుతో నగరంలోని స్కూల్స్‌ను ఆధునికీకరించింది. దీంతో గతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండే ఎంవీపీ సెక్టార్-9 స్కూల్ ముఖ చిత్రం మారిపోయింది. విద్యార్థుల భవిష్యత్‌కు ఉన్నత మార్గం లభించింది. మెరుగైన వసతులు, బోధన లభిస్తోంది. మా పిల్లలతో పాటు మా అన్నయ్య పిల్లలు సెక్టార్-9 స్కూల్‌లో చదువుకుంటున్నారు. మా పిల్లలకు మంచి భవిష్యత్ లభిస్తుందనే నమ్మకం ఏర్పడింది.

\- క్రాంతి, ఫిషర్‌మెన్ కాలనీ

నూతన ఉత్సాహంతో..



ప్రభుత్వ సూచనలతో జీవీఎంసీ మా పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ఆనందంగా ఉంది. దశాబ్దాలుగా అనేక సమస్యలతో సమతమయ్యే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అన్ని రకాలుగా స్కూల్ అబివృద్ధి చెందింది. దీంతో అటు విద్యార్థుల్లో, ఇటు ఉపాధ్యాయుల్లో నూతన ఉత్సాహం ఏర్పడింది. విద్యార్థులు అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నాం. ఇది మత్స్యకార ప్రాంతం కావడంతో గతంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. విద్యాభివృద్ధితో పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

\- రమణ, స్కూల్ ప్రిన్సిపల్

పార్కుల్లో కానరాని సందడి



జూలో కోతుల ఎన్‌క్లోజరు వద్ద సందర్శకులు

ఆరిలోవ: కార్తీక మాసం సందడి పర్యాటక ప్రాంతాల్లో పెద్దగా కనిపించలేదు. క్రికెట్ వరల్డ్ కప్‌లో ఇండియా, ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభం కావడంతో నగరవాసులు ఇంటిలో టీవీలకే పరిమితమయ్యారు. సెలవు రోజు పిల్లలు, పెద్దలు వరల్డ్ కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ చూడడానికే సమయం కేటాయించారు. జూ పార్కులో మాత్రమే సాధారణ రోజుల మాదిరిగా ఆదివారం సందర్శకులు కనిపించారు. కైలాసగిరి, తెన్నేటి పార్కు, కంబాల కొండ, ముడసర్లోవ పార్కుల్లో సాధారణ రోజుల్లో వచ్చిన సందర్శకుల సంఖ్య కూడా లేదు. మొత్తమ్మీద క్రికెట్ పుణ్యమా అంటూ పర్యాటక ప్రాంతాలు వెలవెలబోయాయి. కైలాసగిరిని 1000లోపే సందర్శించినట్లు సిబ్బంది తెలిపారు. కంబాలకొండ ఎకోటూరిజం పార్కులో 400 మంది, ముడసర్లోవ పార్కును 350 మంది వరకు సందర్శించినట్లు ఆయా పార్కుల నిర్వాహకులు తెలిపారు.

జూ పార్కుకు రూ.4 లక్షలు ఆదాయం

జూ పార్కులో మాత్రం సాధారణ రోజుల మాదిరిగా సందర్శకులు వచ్చారు. పిల్లలు, పెద్దలు ఇక్కడ వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద జంతువులు, పక్షులను చూస్తూ సరదాగా గడిపారు. ఇటీవల జూ అధికారులు క్యాంటీన్, కేఫ్‌టేరియాల వద్ద ఏర్పాటు చేసిన ఆట పరికరాలు వద్ద పిల్లలు సరదాగా ఆడుకున్నారు. జూకు 4,500 మంది సందర్శించినట్టు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా సుమారు రూ.4 లక్షలు ఆదాయం లభించిందన్నారు.

మహిళల రక్తదానం



రక్తదానం చేస్తున్న శ్రీసత్యసాయి మహిళా భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా శ్రీసత్యసాయి మహిళా దినోత్సవాన్ని(శక్తిస్వరూపిని దినోత్సవంగా) ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో నిర్వహించారు. ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ప్రేమసదన్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది భక్తులు రక్తదానం చేశారు.

నేత్ర సంరక్షణపై అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు: చిన్నారుల నేత్రాల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు భవిక పంచాల్, స్నేహల్ గంత్రా, వీరేంద్ర సచ్ దేవ్, తదితరులు పాల్గొన్నారు.

నాక్ ర్యాంకుపై మాజీ వీసీల హర్షం



ఆచార్య ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న మాజీ వీసీలు

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానాన్ని సాధించడంపై వైజాగ్ వైస్ చాన్సలర్స్ ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఫోరం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ దేశంలోనే టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను తీర్చిదిద్దారన్నారు. ఏ ప్లస్ ప్లస్ లభించడం కంటే 3.74 సీజీపీఏ సాధించడం ఎంతో కష్టతరమని చెప్పారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేడు ఏయూ ఒక అమూల్య వజ్రంగా మారిందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిరుపమ రాణి మాట్లాడుతూ మానవతా విలువలను మరింతగా విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన వర్సిటీ భూములను వీసీ ప్రసాదరెడ్డి కాపాడడం ప్రశంసనీయమన్నారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారం, తోడ్పాటుతో ఏయూ సమగ్ర అభివృద్ధి సాధ్యపడిందన్నారు. ఇందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం ఫోరం తరఫున ప్రసాదరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.డి.ఎస్.శ్రీనివాస్, ఆచార్య గంగాధరరావు, ఆచార్య జె.వి.ప్రభాకరరావు, పూర్వ ఉపకులపతులు ఆచార్య వై.సత్యనారాయణ, ఆచార్య ఆర్.సుదర్శనరావు, ఆచార్య జగన్నాథరావు, ఆచార్య వెంకట సుబ్బయ్య, ఆచార్య జి.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎస్.వి.సుధాకర్ ఆచార్య నిమ్మ వెంకటరావు, ఆచార్య పి.జార్జి విక్టర్, ఆచార్య కె.రాంజీ, ఆచార్య లజపతిరాయ్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్‌లో సినిమా షూటింగ్

రాకపోకలకు వాహనచోదకుల ఇక్కట్లు



బీఆర్‌టీఎస్‌లో రోడ్డులో షూటింగ్ చేస్తున్న సిబ్బంది



హెల్త్‌సిటీలో ఆస్పత్రులకు వెళ్లేవారిని అడ్డుకుంటున్న షూటింగ్ బౌన్సర్లు

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం హెల్త్‌సిటీ ఎదురుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం జరిగిన ఓ సినిమా షూటింగ్ వాహనచోదకులకు ఇక్కట్లు తెచ్చిపెట్టింది. స్థానికులు, వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. బీఆర్‌టీఎస్‌లో ఇక్కడ నాలుగు లైన్లు ఉన్నాయి. వీటిలో హెల్త్‌సిటీ వైపు సర్వీస్ రోడ్డు ఉంది. ఇక్కడ వీఐపీ, వీవీఐపీలు, ఆర్టీసీ బస్సుల కోసం కేటాయించిన మధ్య లైన్, సింహాచలం నుంచి అడవివరం వైపు వెళ్లే లైన్‌లలో భారతీయుడు-2 సినిమా షూటింగ్ ఫైట్ సీన్ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ రెండు లైన్‌లు నిలిపేశారు. దీంతో సింహాచలం నుంచి హనుమంతవాక వైపు వెళ్లే వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. మూడు లైన్‌లలో ప్రయాణించాల్సిన వాహనాలు అన్నీ ఇక్కడ సర్వీస్ రోడ్డులో మాత్రమే వెళ్లాల్సి వచ్చింది. హెల్త్‌సిటీలో ఆస్పత్రులకు రోగులు, వారి బంధువులు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వారు షూటింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మార్గంలో షూటింగ్‌కు అనుమతి ఇచ్చిన పోలీసులు, జీవీఎంసీ అధికారులపై స్థానికులు, వాహనచోదకులు మండిపడుతున్నారు.

ఆరిలోవలో క్రికెట్ సందడి



గోల్ఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్

ఆరిలోవ: ఆరిలోవలో ఆదివారం క్రికెట సందడి నెలకొంది. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి జనం ఇళ్లలో టీవీలకు అతుక్కుపోయారు. కొందరు యువకులు బైక్‌లపై ఇండియా జాతీయ జెండాలు పట్టుకుని కలియ తిరిగారు. గోల్ఫ్ క్లబ్‌లో బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు స్థానిక యువకులు క్లబ్ గోడలపై ఎక్కి మ్యాచ్ తిలకించారు.

మద్దిలపాలెం : ఇండియా– ఆస్ట్రేలియా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను కొందరు ప్రధాన కూడళ్ల వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసుకుని తిలకించారు. దీంతో మద్దిలపాలెం కూడలితో పాటు సీఎంఆర్ మాల్ వంటి ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి.